సాక్షి
వికారాబాద్
బుధవారం ◦ 27 ◦ నవంబర్ ◦ 2024



నిఘా వైఫల్యం..
జిల్లాలోనే మేజర్ గ్రామమైన కరన్‌కోట్‌లో సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. 8లో▸



తాండూరు ప్రగతికి కృషి
కొడంగల్ తరహాలోనే తాండూరును ప్రగతి పథంలో తీసుకెళ్లానని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. 8లో▸



రైతుల సంక్షేమానికి కృషి
రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

బీపీఎం జిల్లా అధ్యక్షుడు గట్యానాయక్



గిరిజన నాయకులను ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు

పరిగి: అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని బీపీఎం జిల్లా అధ్యక్షుడు గట్యానాయక్ అన్నారు. లగచర్ల ఫార్మా బాధితులకు అండగా మంగళవారం ఎల్‌హెచ్‌పీఎస్, బీపీఎం, బీఎంఎం ఆధ్వర్యంలో చేపట్టిన రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీకి వెళ్తున్న నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై వదిలివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమను అరెస్టు చేసినా పేదల పక్షాన నిలబడి పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వం అక్రమంగా పేదల భూములను లాక్కుంటుంటే ఊరుకోమన్నారు. ఫార్మా భూ బాధిత రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదన్నారు. గిరిజనులు, ఎస్సీలు, బీసీలపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేసి రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గోవింద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ గద్దె దిగాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య



పరిగి ప్రధాన కూడలిలో నిరసన తెలుపుతున్న సంఘం నాయకులు

పరిగి: కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రధాని మోదీ వెంటనే గద్దె దిగాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని బస్టాండ్ ఆవరణంలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్రం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఆర్థిక విధానాలను అవలంబిస్తోందన్నారు. దీంతో సామాన్య ప్రజలు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ప్రజా సంక్షేమం పట్టని ప్రధాని వెంటనే దిగిపోవాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలను తీసుకువచ్చి తీవ్ర అన్యాయం చేశారన్నారు.

రోగులకు అందుబాటులో ఉండండి

జిల్లా వైద్యాధికారి వెంకటరవణ



దోమ: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని జిల్లా వైద్యాధికారి వెంకటరవణ సూచించారు. మంగళవారం దోమ పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా ఓపీ, సిబ్బంది రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. అనంతరం సబ్ సెంటర్ల సిబ్బంది వివరాలపై మండల వైద్యాధికారి రజితను అడిగి తెలుసుకున్నారు.

ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయలేరు



కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం)ను ట్యాంపరింగ్ చేయలేరని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతీక్ జైన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేపర్ బ్యాలెట్ విధానాన్ని మళ్లీ ప్రవేశపెట్టాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని దేశ అత్యున్నత న్యాయస్థానం కొట్టి వేసిందని, ఈవీఎంల ట్యాంపరింగ్‌పై పిటిషనర్ చేసిన వాదనలను న్యాయస్థానం తిరస్కరించిందని తెలిపారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి, పోలీస్ అధికారులు

❖ ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వికారాబాద్‌లోని సంఘం లక్ష్మీబాయి గురుకుల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో న్యాయసేవా సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి, న్యాయమూర్తి డీబీ శీతల్ పాల్గొన్నారు. భారత రాజ్యాంగం ఎంతో గొప్పదని అన్నారు.

– అనంతగిరి



రాజ్యాంగంపై అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి డీబీ శీతల్

అవగాహన అంతంతే..

‘పీఎంకేఎంవై’ గురించి తెలిసింది కొంతమంది రైతులకే..

- పథకంలో చేరితే వృద్ధాప్యంలో రూ.3వేల పింఛను
- అవగాహన లేక ప్రీమియం చెల్లించని వైనం
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం

దౌల్తాబాద్: రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్కీమ్‌ల గురించి రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన ఉంది. అయితే కేంద్ర పథకాల గురించి పెద్దగా తెలియడం లేదు. దీంతో వాటిని అన్నదాతలు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. వృద్ధాప్యంలో రైతులకు చేదోడు వాదోడుగా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన పథకాన్ని (పీఎంకేఎంవై) ప్రవేశపెట్టింది. ఈ పథకంలో చేరిన రైతులకు 60 ఏళ్లు దాటిన తర్వాత ప్రతి నెలా రూ.3 వేల పింఛను అందుతుంది. అయితే వయస్సు ఆధారంగా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. చాలా మందికి పీఎంకేఎంవై గురించి తెలియకపోవడంతో లబ్ధి పొందలేకపోతున్నారు.

జిల్లాలో 2.55లక్షల మంది రైతులు

జిల్లాలో 5.9లక్షల ఎకరాల వ్యవసాయ భూమి, 2.55 లక్షల మంది రైతులు ఉన్నారు. యాసంగి, వానాకాలం సీజన్లలో వివిధ రకాల పంటలు సాగు చేస్తుంటారు. నాలుగేళ్ల క్రితం పీఎంకేఎంవై ప్రారంభమైనా పథకం గురించి వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించడంలో విఫలమయ్యారు. 2021లో మాత్రం మొక్కుబడిగా అవగాహన కల్పించి చేతులు దులుపుకొన్నారు. మూడేళ్ల నుంచి ఎలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించలేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ఈ పథకానికి ఎంత మంది రైతులు అర్హులు.. ఎంత మంది దరఖాస్తు చేసుకున్నారు అనే వివరాలు కూడా వ్యవసాయ శాఖ అధికారుల వద్ద లేకపోవడం గమనార్హం. పథకంపై అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.



పీఎంకేఎంవై పథకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

రూ.55తో ప్రీమియం ప్రారంభం

ప్రధాన మంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన పథకంలో చేరిన రైతులు నెలకు రూ.55 నుంచి ప్రీమియం కడుతూ రావాలి. గరిష్టంగా రూ.200 వరకు కట్టాల్సి రావొచ్చు. మీరు ఏ వయస్సులో పథకంలో చేరారనే అంశం ప్రతిపాదికన మీరు చెల్లించాల్సిన ప్రీమియం మొత్తం ఆధారపడి ఉంటుంది. 18 ఏళ్ల వయస్సులోనే స్కీమ్‌లో చేరితే నెలకు రూ.55 కడితే సరిపోతుంది. అదే 40 ఏళ్ల వయస్సులో చేరితే నెలకు రూ.2 వేలు చెల్లించాల్సి ఉంటుంది. 60 ఏళ్లు దాటిన తర్వాత ప్రతి నెలా రూ.3వేలు పింఛను వస్తుంది. నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమవుతాయి. చిన్న, సన్నకారు రైతులకు సామాజిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు.

అర్హతలు

- ఐదెకరాల్లోపు వ్యవసాయ భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులు పీఎంకేఎంవై పథకానికి అర్హులు
- 18నుంచి 40 ఏళ్లలోపు వారు మాత్రమే పథకంలో చేరవచ్చు
- భార్య, భర్త విడివిడిగా దరఖాస్తు చేయొచ్చు
- వయస్సు ఆధారంగా ప్రతి నెలా ప్రీమియం రూ.55 నుంచి రూ. 200 వరకు చెల్లించాల్సి ఉంటుంది
- రైతు చెల్లించే ప్రీమియానికి సమానంగా కేంద్రం వాటా చెల్లిస్తుంది.
- దరఖాస్తు చేసుకున్న వారు 60 ఏళ్లకు ముందు మరణిస్తే చెల్లించిన మొత్తం వడ్డీతో సహా తిరిగి అందజేస్తారు
- రైతులు కామన్ సర్వీస్ సెంటర్లు, మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు

సద్వినియోగం చేసుకోవాలి

అర్హులైన రైతులు ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈ పథకం గురించి గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాం. మీసేవ, కామన్ సర్వీస్ సెంటర్లలో దరఖాస్తు చేసుకోవచ్చు. అన్ని గ్రామాల్లో ఏఈఓలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

– లావణ్య, ఏఓ, దౌల్తాబాద్

గిరిజనుల భూముల్లో ఫార్మా వద్దు

- పరిశ్రమల ఏర్పాటును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి
- రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి
- ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు దాస్‌రాంనాయక్

కొడంగల్ రూరల్: గిరిజనుల భూముల్లో ఫార్మా కంపెనీ ఏర్పాటును ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వ స్థలాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసుకుంటే ఎవ్వరికీ ఇబ్బంది ఉండదని ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు దాస్‌రాంనాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలో ఎల్‌హెచ్‌పీఎస్, భరత ముక్తి మోర్చా, జాతీయ ఓబీసీ సంఘాలు, రాష్ట్రీయ ముస్లిం మోర్చా ఆధ్వర్యంలో ‘చలో కొడంగల్ రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ’ అనే కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లగచర్లతో పాటు ఫార్మా బాధిత రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లగచర్ల ఘటన తర్వాత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. తండాల్లో శాంతియుత వాతావరణం నెలకొల్పేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్, బీజేపీ రాజకీయ లబ్ధి కోసం ఎస్టీ రైతులను బలిచేస్తే ఊరుకునేదిలేదన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన రైతులను వెంటనే విడుదల చేయాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ మహిళా అధ్యక్షురాలు శాంతిబాయి, ఓబీసీ మోర్చా నాయకురాలు సంతోష, ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌కుమార్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌నాయక్, రాష్ట్రీయ ముస్లిం మోర్చా ప్రధాన కార్యదర్శి ఫహీమ్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పాత్లావత్ గటియానాయక్, రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్, జాతీయ కార్యదర్శి కొర్ర పాండునాయక్, జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు దాస్‌రాంనాయక్

వేగవంతం చేయండి

- కలెక్టర్ ప్రతీక్‌జైన్
- ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సమీక్ష

అనంతగిరి: జిల్లాలో ధాన్యం సేకరణను వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. మంగళవారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్లతో ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రోజు ఎంత మేర ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తోంది.. ఇంకా ఎంత మేర వచ్చే అవకాశం ఉంది అనేదానిపై నివేదిక ఇవ్వాలన్నారు. గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రవాణా చేసేందుకు లారీలను సమకూర్చుకోవాలని తెలిపారు. ఈ నెల 30న ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే రైతుల పండుగను విజయవంతం చేయాలని అన్నారు. రైతు రుణమాఫీ, సన్న రకం వడ్లకు బోనస్, రైతు సంక్షేమ పథకాలపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ అధికారులు విజయలక్ష్మి, మోహన్‌బాబు పాల్గొన్నారు.



ధారూరు: ధాన్యం తూకాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వసతులు కల్పించండి

ధారూరు: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. ధారూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో నాగారం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. తేమ శాతం, తూకం వేసే విధానాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ధాన్యం తెచ్చేందుకు అవసరమైన గన్నీ బ్యాగులు ఇచ్చేలా కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలకు ఆదేశాలు ఇవ్వాలని రైతులు కోరారు. తాగునీటి వసతి లేక ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. స్పందించిన అదనపు కలెక్టర్ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు వసతులు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ధారూరు పీఏసీఎస్ చైర్మన్ వై సత్యనారాయణరెడ్డి, డీఎస్ఓ మోహన్‌బాబు పాల్గొన్నారు.

మహిళల ఉపాధి కోసం చిన్నతరహా పరిశ్రమ

- రూ.50 కోట్లతో ఏర్పాటు చేస్తాం
- రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల
- తాండూరు – వికారాబాద్ రోడ్డుకు రూ.100 కోట్లు మంజూరు
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

బషీరాబాద్: మహిళలకు ఉపాధి కల్పనే లక్ష్యంగా మండలంలో చిన్నతరహా పరిశ్రమ నెలకొల్పుతామని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రకటించారు. ఇందుకోసం రూ.50 కోట్లు అవసరమైనా మంజూరు చేస్తామని తెలిపారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని మంతట్టి గ్రామంలో రూ.30 లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. డ్వాక్రా మహిళలకు బ్యాంకు లింకేజీ కింద రూ.1.20 కోట్ల రుణ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. డిసెంబరులో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, రైతు భరోసా, రైతు బీమా, కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయనున్నట్లు చెప్పారు.

త్వరలో తాండూరుకు సీఎం

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే తాండూరు అభివృద్ధికి వందల కోట్లు తెచ్చానని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. రూ.200 కోట్లతో దౌలాపూర్ వద్ద యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మించనున్నట్లు చెప్పారు. వికారాబాద్ – తాండూరు రోడ్డు అభివృద్ధికి రూ.100కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. జీవన్గీ – కరణ్‌కోట్, బషీరాబాద్‌లో 30 పడకల ఆస్పత్రి మంజూరు చేయించానని అన్నారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో నిధులు లేకున్నా శిలాఫలకాలు వేశారని ఆరోపించారు. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. అంతకుముందు ఐకేపీ ద్వారా శ్రీనిధి రుణాలతో ఏర్పాటు చేసిన పలు షాపులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం జెడ్పీహెచ్‌ఎస్‌లో జరిగిన రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కరుణ, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి, బషీరాబాద్, తాండూరు మార్కెట్ కమిటీల చైర్మన్లు మాధవరెడ్డి, బాల్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు శంకర్‌రెడ్డి, సురేష్, మహేందర్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింలు, లక్ష్మణ్‌రావు, మాపిక్‌రెడ్డి, శ్రీధర్, తహసీల్దార్ వెంకటేశం, ఎంపీడీఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



డ్వాక్రా మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ఓటు ఎంతో విలువైనది

- కలెక్టర్ ప్రతీక్‌జైన్
- ఓటు హక్కుపై 2కే రన్
- పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

అనంతగిరి: ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తప్పని సరిగా ఓటు హక్కు పొందాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ఎన్నెపల్లి చౌరస్తా నుంచి ఎన్‌టీఆర్ చౌరస్తా వరకు 2కే రన్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పెషల్ సమ్మరి రివిజన్ 2025లో భాగంగా ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఓటు హక్కు వజ్రాయుధంతో సమానమన్నారు. అనంతరం ఎస్పీ నారాయణరెడ్డి మాట్లాడుతూ ఓటు ఎంతో అమూల్యమైనదని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, స్వీప్ నోడల్ ఆఫీసర్ ఎంఏ సత్తార్, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద రంగోలి

స్వీప్ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ ఎదుట మెప్మా, గురుకుల పాఠశాలల విద్యార్థినులు, సెర్ప్ మహిళా సంఘాల సభ్యులతో రంగోలి కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, విద్యార్థులు చక్కటి ముగ్గులు వేశారు. వీటిని కలెక్టర్ ప్రతీక్ జైన్ పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, స్వీప్ నోడల్ ఆఫీసర్ సత్తార్, డీఆర్‌డీఓ శ్రీనివాస్, మెప్మా పీడీ రవికుమార్, డీఈఓ రేణుకాదేవి, డీపీఓ జయసుధ, ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ మల్లేశం, ఆర్డీఓ వాసుచంద్ర, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు అందరి బాధ్యత

కొడంగల్ రూరల్: ఓటు హక్కు పొందడం బాధ్యతగా భావించి.. 18ఏళ్లు నిండిన యువత ఓటరుగా పేర్లు నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. మంగళవారం పట్టణంలోని అంగడిబజార్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు విద్యార్థులు, యువకులు, అధికారులతో కలిసి 2 కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు 2కే రన్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, ఎంఈఓ రాంరెడ్డి, ఎస్ఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి 2కే రన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

క్లుప్తంగా

మోమిన్‌పేటలో అత్యల్ప ఉష్ణోగ్రత

జిల్లాలో గణనీయంగా పడిపోతున్న టెంపరేచర్



బషీరాబాద్: జిల్లాలో రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. మంగళవారం మోమిన్‌పేటలో 9.8 అత్యల్ప ఉష్ణోగ్రత రికార్డు అయినట్లు జిల్లా వాతావరణ శాఖ అధికారి అశోక్‌కుమార్ తెలిపారు. మర్పల్లిలో 9.9 డిగ్రీలతో రెండో స్థానంలో ఉండగా, బంట్వారం, మన్నెగూడలో 10.7 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. వికారాబాద్ నియోజకవర్గ పరిధిలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండగా, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాలలో కనిష్టంగా 12 డిగ్రీల లోపు కొనసాగుతున్నాయి. దీంతో ఉదయం 10 దాటిన చలిపులి జనాన్ని వణికిస్తూనే ఉంది. పొలం పనులకు వెళ్లే రైతులు సైతం చలి తీవ్రతకు చలి మంటలు కాచుకుంటున్నారు. పల్లెల్లో ఎక్కడ చూసిన ఉన్నిదుస్తులు ధరించి జనం రోడ్ల మీదకు వస్తున్నారు.

కొనసాగుతున్న పోలీస్ భద్రత



రోటిబండ తండా సమీపంలో బలగాలు

దుద్యాల్: మండల పరిధిలోని లగచర్ల, రోటిబండ తండా, పులిచెర్లకుంట తండాల్లో పోలీస్ పహారా కొనసాగుతుంది. లగచర్ల ఘటన తర్వాత ఆయా గ్రామాల్లో నిత్యం పోలీస్ బలగాలు పర్యవేక్షిస్తూనే ఉన్నాయి. రోటిబండ తండా, పులిచెర్లకుంట తండాల్లో గిరిజన సంఘాలకు చెందిన నాయకులు బాధితులను పరామర్శించడానికి వస్తుండడంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని భావనతో అధికారులు నిత్యం పోలీస్ బందోబస్తు కొనసాగిస్తున్నారు. ఆయా గ్రామాలకు వచ్చే మార్గాలలో పోలీసులు ప్రతీ ఒక్కరిని ప్రశ్నిస్తూ, సోదా చేస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో ఈ నెల11 నుంచి బందోబస్తు కొనసాగుతోంది.

ఉరేసుకొని కార్మికుడి ఆత్మహత్య



మోహిత్ (ఫైల్)

పరిగి: వ్యక్తిగత కారణాలతో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ కార్మికుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని మాదారం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. యూపీలోని ఉన్నవ్ జిల్లా నారినగర్‌కు చెందిన మోహిత్(31) తన తమ్ముడు సోహిత్ మాదారం గ్రామంలోని పవన్ ప్లైవుడ్ కంపెనీలో లేబర్ పని చేస్తున్నారు. మోహిత్ ఉత్తర్‌ప్రదేశ్‌లో ఉన్నప్పుడు ఓ కేసులో జైలుకు వెళ్లి రాగా అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. సోమవారం కంపెనీలో పనికి రాకుండా మద్యం తాగి రూంలో ఉన్నాడు. ఈ క్రమంలో గదిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాత్రి 10 గంటలకు సోహిత్ పని ముగించుకుని రూంకి వెళ్లి చూడగా మోహిత్ విగతజీవిగా పడి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తమ్ముడు సోహిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ ఢీకొని.. వ్యక్తికి గాయాలు

తాండూరు రూరల్: బైక్ ఢీకొనడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం మండల పరిధిలోని గౌతపూర్ వద్ద చోటు చేసుకుంది. ఎస్ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గోట్లపల్లి సైదప్ప కూలీ పనులు చేస్తున్నాడు. మంగళవారం గౌతపూర్ ప్రధాన చౌరస్తా వద్ద యాక్సిస్ బ్యాంక్‌వైపు రోడ్డు దాటుతుండగా చెంగోల్ నుంచి వస్తున్న ఓ బైక్ సైదప్పను ఢీకొట్టింది. దీంతో ఆయనకు గాయాలు కావడంతో ఆసుపత్రికి తీసుకెళ్లారు.ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

కిటికీ స్ర్కూలు తొలగించి

ఇంట్లో చొరబడి నగదు, బంగారు, వెండి ఆభరణాల చోరీ

మీర్‌పేట: ఇంట్లో దొంగలు పడి నగదుతో పాటు వెండి, బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. ప్రశాంతిహిల్స్‌లోని పింగిళి అపార్ట్‌మెంట్ 101 ఫ్లాటులో నివాసముండే రాసోజు మోహన్ సోమవారం రాత్రి కుటుంబంతో కలిసి మల్కాజిగిరి మౌలాలిలోని బంధువుల శుభకార్యానికి వెళ్లాడు. తిరిగి మంగళవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తాళాలు పగులగొట్టి బెడ్‌రూంలోని బీరువా తెరిచి ఉంది. అందులో ఉంచిన రూ.5 లక్షల నగదు, నాలుగు తులాల బంగారం, రెండు తులాల వెండి ఆభరణాలు కనిపించకపోవడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దొంగలు కిటికీ స్ర్కూలు తొలగించి దొంగతనానికి పాల్పడినట్లు సీసీ టీవీ కెమెరాలో గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

నిఘా వైఫల్యం.. నేరాలకు ఆజ్యం

- కరన్‌కోట్‌లో పనిచేయని సీసీ కెమెరాలు
- బాలిక అదృశ్యంతో ఉలిక్కిపడ్డ గ్రామస్తులు
- గాలింపు చర్యలు చేపడుతున్న పోలీసులు



కరన్‌కోట్ ప్రధాన చౌరస్తాలో నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరాలు

తాండూరు రూరల్: జిల్లాలోనే మేజర్ గ్రామమైన కరన్‌కోట్‌లో నిఘా వైఫల్యం కొట్టొచ్చినట్లు స్పష్టమవుతోంది. ఇటీవల గ్రామంలో ఓ బాలిక అదృశ్యం స్థానికంగా కలకలం రేపింది. దీంతో గ్రామస్తులు చిన్నారులను బయటికి పంపించాలంటే జంకుతున్నారు. మరోవైపు గ్రామంలోని సీసీ కెమెరాలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. కరన్‌కోట్ గ్రామం చుట్టూ సిమెంట్ ఫ్యాక్టరీలతో పాటు వందల నాపరాతి గనులు ఉన్నాయి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న గ్రామంలో సైతం భద్రత డొల్లతనం బయటపడడం కలవరపెడుతోంది.

10 వేల మంది జనాభా

వ్యాపార పరంగా కరన్‌కోట్ ప్రాంతం అభివృద్ధి చెందింది. గ్రామ శివారులో సీసీఐ ఫ్యాక్టరీతో పాటు సిమెంట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. వందల నాపరాతి గనులు ఉండటంతో ఇక్కడ పని చేసేందుకు వివిధ ప్రాంతాల నుంచి కార్మికులు వలస వచ్చి గ్రామంలోనే నివాసముంటున్నారు. సీసీఐ ఫ్యాక్టరీలో పని చేస్తున్న వివిధ రాష్ట్రాల ప్రజలు కూడా సీసీఐ కాలనీలో ఉంటున్నారు. వ్యాపార పరంగా పేరుగాంచిన కరన్‌కోట్‌లో భద్రత లోపించిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిరుపయోగంగా నిఘా నేత్రాలు

గ్రామంలో సీసీ కెమెరాలు నిరుపయోగంగా మారాయి. గ్రామంలో బంగారమ్మ గుడి, హనుమాన్ దేవాలయంతో పాటు ఓగిపూర్-కరన్‌కోట్ మార్గంలో రూ.లక్షలు వెచ్చించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అవి వినియోగంలో లేవు. దీంతో గ్రామంలో ఏదైన సంఘటన జరిగినప్పుడు నిందితులను గుర్తించడం కష్టతరంగా మారింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు సీసీ కెమెరాలు వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విస్తృతంగా తనిఖీ చేస్తున్నాం



కరన్‌కోట్‌లో బాలిక అదృశ్యమైన సంఘటనకు సంబంధించి విచారణ కొనసాగుతుంది. అమ్మమ్మ లాలమ్మ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశాం. బాలిక బస్సు ఎక్కి తాండూరులో దిగిందని తెలిసింది. ప్రస్తుతం రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతున్నాం. గ్రామంలో సీసీ కెమెరాలు ఉపయోగంలో లేకపోవడంతో గుర్తించడం కష్టంగా మారింది. పాప ఆచూకీ కోసం తీవ్రంగా గాలిస్తున్నాం. బంధువులను కూడా విచారించి వివరాలు సేకరిస్తున్నాం.

– విఠల్‌రెడ్డి, ఎస్ఐ, కరన్‌కోట్

తాండూరు ప్రగతికి కృషి

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్: సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ ప్రాంతంలో జరిగే అభివృద్ధి తరహాలోనే తాండూరును ప్రగతిపథంలో తీసుకెళ్లానని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గోనూర్‌లో ప్రజా విజయోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్పొరేట్ తరహా మెరుగైన విద్యను అందించేందుకు రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు అయ్యిందన్నారు. అనంతరం బోనమ్మ గుడి నుంచి అగ్గనూర్ శివారు వరకు రూ.15 లక్షలతో ఫార్మేషన్ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్ ,మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగప్ప, ఎంపీడీఓ విశ్వప్రసాద్, అడిషనల్ సీడీపీఓ శ్రీలక్ష్మీ, నాయకులు ఉత్తమ్‌చందు, రాందాస్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బోనమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

తాండూరు: పాత తాండూరు ప్రాంతంలో ఉన్న బోనమ్మ(భవానిమాత) దేవాలయ జాతరలో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్‌లు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.



తాండూరు: బోనమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తదితరులు

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

జిల్లా ఆస్పత్రి వైద్యురాలు రుబియానాజ్



వసతిగృహంలో భోజనాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ రుబియానాజ్

తాండూరు రూరల్: ప్రతి విద్యార్థి వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని తాండూరులోని జిల్లా ఆస్పత్రి వైద్యురాలు రుబియానాజ్ సూచించారు. మంగళవారం మండలంలోని జినుగుర్తి గేటు వద్ద ఉన్న గురుకుల మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పృథ్వీతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని ఆదేశించారు. పురుగుల అన్నం వడ్డిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వంట సామగ్రి, పాత్రలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తర్వాత విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వినోద్ ఖన్నా, వైద్య సిబ్బంది ప్రమీల, కృష్ణవేణి, కళాశాల కో ఆర్డినేటర్ సురేష్, స్కూల్ కో ఆర్డినేటర్ మహబూబ్, ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

అటవీ భూమిలో బోరు

ఇద్దరిపై కేసు నమోదు

కుల్కచర్ల: అటవీశాఖ భూమిలో బోరు వేయించిన ఇద్దరిపై కేసు నమోదు చేశారని ఫారెస్ట్ అధికారి సాయికుమార్ తెలిపారు. కుల్కచర్ల మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన చిల్ల రామకృష్ణ, సున్నల దస్తయ్యల సూచనల ప్రకారం బోరుబండి నిర్వాహకులు సోమవారం రాత్రి ఎలాంటి అనుమతులు లేకుండా అటవీశాఖ భూమిలో బోరు వేశారు. ఈ వ్యవహారంపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సెక్షన్ ఆఫీసర్ సాయికుమార్ పేర్కొన్నారు.

వైన్స్‌లో చోరీకి యత్నం

దోమ: కొందరు దుండగులు వైన్స్ దుకాణాలనే టార్గెట్‌గా చేసుకొని దొంగతనాలకు యత్నిస్తున్నారు. దోమ మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర వైన్స్ దుకాణానికి సోమవారం రాత్రి సిబ్బంది తాళాలు వేసి వెళ్లిపోయారు. దీంతో దుండగులు వైన్స్‌లో చోరీ చేసేందుకు అర్ధరాత్రి సమయంలో యత్నించారు. ముందుబాగంలో ఉన్న గ్రిల్స్‌కు ఉన్న తాళాలను పగలగొట్టి షెట్టర్ తాళాలను విరగొట్టేందుకు ప్రయత్నించారు. కానీ అవి ఓపెన్ కాపోవడంతో దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. మంగళవారం వైన్స్‌కు వెళ్లిన సిబ్బందికి గ్రిల్స్ తాళాలు విరగొట్టడం చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైలు కింద పడి మహిళ ఆత్మహత్య

తాండూరు టౌన్: రైలు కింద పడి ఓ గుర్తు తెలియని మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈఘటన మంగళవారం తాండూరు రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 40 ఏళ్ల వయసున్న ఓ మహిళ సాయంత్రం తాండూరు మీదుగా వైజాగ్ వెళ్తున్న ఎల్‌టీటీ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏఎస్పీ రవీందర్‌రెడ్డి బదిలీ

అనంతగిరి: వికారాబాద్ జిల్లా అడిషనల్ ఎస్పీ రవీందర్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా ఆయన స్థానంలో జిల్లా ఏఎస్పీగా హైదరాబాద్ సిటీ వెస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీగా విధులు నిర్వహిస్తున్న టీవీ హనుమంతరావును నియమించింది. కాగా రవీందర్‌రెడ్డిని హైదరాబాద్ సిటీ సీసీఎస్, ఈఓడబ్ల్యూ విభాగంలో అడిషనల్ డీసీపీగా బదిలీ చేసింది.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరు

వికారాబాద్‌లో వ్యవసాయ, కార్మిక సంఘాల నిరసన ర్యాలీ



ర్యాలీ చేపట్టిన వివిధ సంఘాల నాయకులు

అనంతగిరి: కేంద్రం తీసుకువచ్చిన రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలు, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని పలు వ్యవసాయ రైతు, కార్మిక సంఘాల జిల్లా ముఖ్య నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల దేశవ్యాప్త పిలుపులో భాగంగా వ్యవసాయ, రైతు, కార్మిక సంఘాల జిల్లా కమిటీల ఆధ్వర్యంలో వికారాబాద్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కొంతమంది పెట్టుబడిదారుల కోసం యావద్దేశ సంపదనంతా ధారాదత్తం చేయడం సమంజసం కాదన్నారు. కేంద్రం రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబించడం తగదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గీత, ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి గోపాల్‌రెడ్డి, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు మహేందర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పీర్‌మహ్మద్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఆశవర్కర్ల యూనియన్ జిల్లా నాయకురాలు మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

చౌదర్‌పల్లిలో అభివృద్ధి పనులు



పశువుల పాక నిర్మాణ మంజూరు పత్రం అందజేస్తున్న గ్రంథాలయ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట: మండల పరిధిలోని చౌదర్‌పల్లిలో అభివృద్ధి పనులకు నిధులు నిండుగా వస్తున్నాయని జిల్లా గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. గ్రామంలో రూ.1.13 కోట్లతో అభివృద్ధి పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.61లక్షలతో పాఠశాలకు రెండు అదనపు తరగతి గదుల నిర్మాణం, రూ.20లక్షలతో అంగన్‌వాడీ భవనం, అలాగే గ్రామంలోని 32 మంది రైతులకు రూ.లక్ష చొప్పున రూ.32 లక్షలతో పశువుల పాకల నిర్మాణాలకు ఆయన భూమిపూజలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి కృషితో నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకన్నగౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు నర్సింలుగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, రాంచంద్రారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింలునాయుడు తదితరులు పాల్గొన్నారు.

బస్తాల కోసం ఎదురుచూపులు



కొనుగోలు కేంద్రంలో బస్తాలు లేక పడి ఉన్న ధాన్యం రాశులు

బొంరాస్‌పేట: వరి ధాన్యం కొనుగోలు కేంద్రానికి రెండు రోజులుగా గన్నీ బ్యాగులు సరఫరా లేకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో గత రెండు రోజులుగా గన్నీ బ్యాగుల కొరత ఏర్పడింది. ఇప్పుడా, అప్పుడా అంటూ రైతులు రోజంతా పడిగాపులు గాసి ఇళ్లకు వెళ్తున్నారు. ఈ కేంద్రానికి మండల కేంద్రంతోపాటు చుట్టుపక్కల గ్రామాలు, తండాల రైతులు ధాన్యం తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. బస్తాలు లేకపోవడంతో రెండు రోజులుగా ధాన్యం కొనుగోళ్లు బంద్ నిలిచిపోయాయి. దీనిపై అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌ను వివరణ కోరగా త్వరలో బన్నీ బ్యాగులను సరఫరా చేస్తామన్నారు.

సొంతూరికి వెళ్లొస్తూ.. అనంత లోకాలకు

రైలు దిగుతూ జారిపడి మహిళ దుర్మరణం



ఉమ (ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: స్వగ్రామానికి వెళ్లి వస్తున్న మహిళ.. మరో ఐదు నిమిషాల్లో ఇంటికి చేరుతానని భావించింది. కానీ విధి ఆడిన నాటకానికి బలైంది. రైలు దిగుతూ కాలు జారి పడటంతో అనంత లోకాలకు చేరుకుంది. ఈ విషాద ఘటన పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం వెల్‌మాల గ్రామానికి చెందిన సురేష్, ఉమ(33) దంపతులు. కుటుంబంతో కలిసి సీఎస్కే విల్లాస్ సమీపంలోని గురురాఘవేంద్రకాలనీలో నివాసం ఉంటున్నారు. సురేష్ మొగిలిగిద్ద సమీపంలోని ఓ పరిశ్రమలో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. స్వగ్రామం వెల్‌మాలలో శుభకార్యం ఉండటంతో ఉమ అక్కడకు వెళ్లింది. ఆమె గుంటూరు రైలులో తిరిగి సోమవారం షాద్‌నగర్‌కు బయలుదేరింది. రైల్వే స్టేషన్‌లోని 3వ ప్లాట్ ఫాంలో దిగుతుండగా కాలుజారి ప్రమాదవశాత్తు ఆమె రైలు కిందకు వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త, కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. స్టేషన్ మాస్టర్ మనోహర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు మహబూబ్‌నగర్ రైల్వే ఎస్ఐ అక్బర్ తెలిపారు.

ఓటు వజ్రాయుధం లాంటిది



పరిగి: 2కే రన్‌లో పాల్గొన్న ఆర్డీఓ వాసు చంద్ర



తాండూరు: ర్యాలీ చేపట్టిన సబ్ కలెక్టర్, అధికారులు, విద్యార్థులు

సబ్ కలెక్టర్ ఉమాశంకర్

తాండూరు: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అన్నారు. మంగళవారం ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమంలో భాగంగా సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు, విద్యార్థులతో కలిసి 2కే రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి విలియంమూన్ మైదానం వరకు 2కే రన్ నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. 18 ఏళ్ల వయసుపై బడిన యువకులు ఓటు హక్కును పొందాలన్నారు. ప్రజలకు ఓటు అనేది ఒక వజ్రాయుధమన్నారు. ఓటుహక్కును రాజ్యాంగం మనకు కల్పించిన హక్కన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డి, మేనేజర్ నరేందర్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కు కీలకం

పరిగి: ఓటు వజ్రాయుధం లాంటిదని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ వాసుచంద్ర సూచించారు. స్వీప్ ఆధ్వర్యంలో 2కె రన్ కార్యక్రమం నిర్వహించి ఓటు హక్కుపై అవగాహన నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా పరిపాలన విధంగా అన్ని అర్హతలు ఉన్న వ్యక్తికి తమ ఓటును వేయాలన్నారు. ప్రజాస్వామ్యంతో ఓటు హక్కుకు ఉన్న విలువ దేనికి లేదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే కాలె యాదయ్య



చించల్‌పేటలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

వికారాబాద్: చేవెళ్ల నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో 100 శాతం సీసీ రోడ్లను పూర్తి చేస్తామని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. నవాబుపేట మండల పరిధిలోని చించల్‌పేట గ్రామంలో మంగళవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సీసీ రోడ్లను 100 శాతం వేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఆయంలో గ్రామాలన్ని అభివృద్ధి వైపు నడుస్తున్నాయన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికి చేరేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, ఎంపీడీఓ అనురాధ, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, ఖదీర్, బాలయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

‘చేయూత’ నిచ్చేదెవరు?

- వేలిముద్రలు సరిగా పడక ఇబ్బందులు ఎదుర్కొంటున్న లబ్ధిదారులు
- పంచాయతీ కార్యదర్శుల కోసం పడిగాపులు
- బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలంటూ విజ్ఞప్తి

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు చేయూత పథకం కింద అందించే పింఛన్ల అమలులో కొత్త చిక్కులు వచ్చిపడ్డాయి. వయసు మళ్లిన లబ్ధిదారులకు వేలిముద్రలు పడక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామ కార్యదర్శుల వేలిముద్రల కోసం పడిగాపులు కాస్తున్నారు.



వేలిముద్రతో చేయూత పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారులు

దౌల్తాబాద్: నెల నెల రాష్ట్ర ప్రభుత్వం అందించే చేయూత పింఛన్లను సకాలంలో అందుకోలేక చాలా మంది వృద్ధులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. వేలి ముద్రల కారణంగా ఆలస్యంగా పింఛను నగదు ఇస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. మండలంలో ఆరు వేల ఫింఛన్లకుగాను ఇందులో 800 మంది వృద్ధులు, వితంతువులకు వేలిముద్రలు సరిగ్గా పడక ఆయా గ్రామ కార్యదర్శుల వేలిముద్రల కోసం వేచిచూస్తున్నారు. గ్రామ కార్యదర్శులకు ఏదైనా పని ఉంటే, వారు వచ్చి వేలిముద్రలు వేసే వరకు చాలా మందికి పింఛన్లు రావడంలేదు. మరో మార్గంగా ఆధార్‌కార్డులో వేలిముద్రలు అప్‌డేట్ చేసినా కొంత మందివి నిర్ధారణ కావడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో చాలా చోట్ల పోస్టాఫీసులు ఉన్న చోట ఆయా గ్రామాల పోస్టుమాస్టర్లు పింఛను డబ్బులను ఇస్తున్నారు. మరికొన్ని చోట్ల పోస్టాఫీసుల్లో ఖాతాలు తెరిచి నేరుగా వారికి ఆయా అకౌంట్లలో జమ చేస్తున్నారు.

వేలిముద్రలు పడక

చాలా మంది గ్రామాల్లో వృద్ధులు, వితంతువులు ఆధార్ నమోదు ప్రక్రియలో మొదటిసారి తీసుకున్నాకా, వాటిని ఎక్కడా అప్‌డేట్ చేయకపోవడం తీవ్ర సమస్యగా మారింది. ఆధార్ అప్‌డేట్ చేయించాలని వారి కుటుంబ సభ్యులకు తెలియక, అధికారులు సైతం అవగాహన కల్పించకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దీంతో సకాలంలో చేయూత పింఛను పొందక, నెలవారీ అవసరాలు తీరక లబ్ధిదారులు మదనపడుతున్నారు.

దుర్వినియోగంపై ఆరోపణలు

మరోవైపు పింఛన్ల పంపిణీలో అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉత్పన్నమవుతున్నాయి. వేలిముద్రల సాకుతో పలుచోట్ల చేయూత డబ్బులు పక్కదారి పడుతున్నాయని అంటున్నారు. అధికారులు వీటిపైన దృష్టి సారించాలని కోరుతున్నారు. గత ప్రభుత్వంలో నూతన పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి నుంచి వివరాలతో పాటు బ్యాంకు ఖాతాను కచ్చితంగా తీసుకుని ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. ఆ సమయంలో చాలా మంది వృద్ధులు, వితంతువులు బ్యాంకు ఖాతాలు సైతం సేకరించినా అందుకు సంబంధించిన నగదును ఖాతాలో జమ చేయలేదు. ఇప్పటికైనా అధికారులు పింఛన్ డబ్బులను నేరుగా బ్యాంకు ఖాతాలో జమ చేయాలని పింఛన్‌దారులు కోరుతున్నారు.

ఖాతాలో వేయాలి



వయసు మీద పడడంతో చేతికి ఉన్న వేలిముద్రలు అరిగిపోయాయి. కార్యదర్శి వచ్చి వేలిముద్రలు ఇచ్చిన తర్వాత పింఛన్ ఇస్తున్నారు. కొన్నిసార్లు కార్యదర్శి అందుబాటులో లేకపోతే చాలా ఇబ్బందిగా ఉంటుంది. సమయానికి మందులకు డబ్బులు అవసరం పడితే కష్టమవుతుంది. బ్యాంకు ఖాతాలో జమ చేస్తే బాగుంటుంది.

– మాణిక్యమ్మ, వృద్ధురాలు, దౌల్తాబాద్